నమస్తే తెలంగాణ
ములుగు
జయశంకర్ భూపాలపల్లి
3 | శనివారం 24 ఫిబ్రవరి 2024 | MULUGU JAYASHANKAR BHUPALPALLY

## నేడు వన ప్రవేశం

భక్తకోటిని దీవించి, ఆశీర్వదించిన సమ్మక్క శనివారం సాయంత్రం తిరిగి వనప్రవేశం చేయనుంది. సారలమ్మ కన్నెపల్లికి వెళ్లిపోనుంది. పగిడిద్దరాజు పూనుగుండ్లకు, గోవింద రాజులు కొండాయికి అదే సమయంలో వెళ్లిపోతారు. ఆదివాసీ గిరిజన సంప్రదాయాల ప్రకారం వడ్డెలు గద్దెల వద్ద ప్రత్యేక పూజలు చేసి తల్లులను తిరిగి సాగనంపుతారు. ఈ తంతును వనప్రవేశంగా పిలుచుకునే ఆచారం కొనసాగుతూ వస్తున్నది.

సమ్మక్కా.. మళ్లొస్తం..



జంపన్నవాగు బ్రిడ్జి మీదుగా తిరుగుపయనమైన భక్తులు



తిరుగుపయమైన భక్తులు



# ఉప్పొంగిన జనగంగ

మేడారంలో తల్లుల దర్శనానికి 'కోటె'త్తిన భక్తులు

## అమ్మవార్లకు ఘనంగా మొక్కులు

### కిక్కిరిసిన వన దారులు

### సమ్మక్క-సారలమ్మను దర్శించుకున్న గవర్నర్ తమిళిసై, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు

### నేడు తల్లుల వనప్రవేశం

తాడ్వాయి, ఫిబ్రవరి 23 : మేడారంలో గద్దెలపై కొలువుదీరిన సమ్మక్క-సారలమ్మలను దర్శించుకొని మొక్కులు చెల్లించుకునేందుకు భక్తకోటి శుక్రవారం పోటెత్తింది. గంటల తరబడి లైన్లలో నిలబడి తల్లులను దర్శించుకోవాల్సి వచ్చింది. ఇదే రోజు ప్రముఖులు దర్శనానికి రావడంతో భక్తులకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. గవర్నర్ తమిళిసై సౌందర రాజన్, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కేంద్ర మంత్రి అర్జున్ ముండా, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కొండా సురేఖ, శ్రీధర్‌బాబు, సీతక్క శుక్రవారం మధ్యాహ్నం అమ్మవార్లను దర్శించుకున్నారు. వీఐపీ, వీవీఐపీ ప్రత్యేక దర్శన పాస్‌లు కలిగి ఉన్న భక్తులు సైతం మూడు నుంచి నాలుగు గంటల పాటు క్యూలో నిల్చుని విసిగివేసారి పోయారు. ఒక సందర్భంలో పోలీసులు భక్తులపై లాఠీచార్జి చేశారు. దీంతో భక్తుల్లో ఆగ్రహం కట్టలు తెంచుకొని రోడ్డు పైకి వచ్చి ఆందోళన చేశారు. సీఎం రేవంత్‌రెడ్డికి, మంత్రి సీతక్కకు, పోలీసులకు వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేశారు.

మేడారానికి దాదాపు పది కిలోమీటర్ల విస్తీర్ణంలో గుడారాలు ఏర్పాటు చేసుకున్న భక్తులు ఇంటిల్లిపాదితో వచ్చి శుక్రవారం తల్లులను దర్శించుకునేందుకు బారులు తీరారు. క్యూలైన్లు, గద్దెల ప్రాంగణంలో దర్శనానికి పోటెత్తారు. గద్దెల ప్రాంగణం ఎడతెరపిలేని గంటానాదాలతో మార్మోగింది. నెత్తిన బంగారం ముద్దలు, చంకన పిల్లలను ఎత్తుకొని వస్తున్నవారితో రోడ్లన్నీ కిక్కిరిసిపోయాయి. మధ్నాహ్నం ఎండ ఉన్నా, క్యూలో గంటల తరబడి వేచి ఉండి అమ్మవార్లకు మొక్కులు ముట్టజెప్పారు. ఈసారి మహాజాతరకు శుక్రవారం వరకు కోటీ 50లక్షల మంది వరకు తరలివచ్చారని రాష్ట్ర దేవాదాయ శాఖ అధికారులు వెల్లడించారు.



సమ్మక్క గద్దె వద్ద పోటెత్తిన భక్తులు

విద్యుత్ దీపాలతో వెలిగిపోతున్న మేడారం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

## మేడారానికి జాతీయ హోదా ఇవ్వాలి

తాడ్వాయి, ఫిబ్రవరి 23 : మేడారం జాతరకు కేంద్ర ప్రభుత్వం జాతీయ హోదా ఇవ్వాలని, ఈ ప్రాంత అభివృద్ధి కోసం మంత్రులతో కమిటీ వేసి తానే పర్యవేక్షిస్తానని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన సమ్మక్క-సారలమ్మను దర్శించుకొని ఎత్తు బంగారం సమర్పించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆరు గ్యారెంటీల్లో భాగంగా ఈ నెల 27న మరో రెండు హామీలను ప్రారంభిస్తామని రూ.500కే గ్యాస్ సిలిండర్, తెల్లరేషన్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇచ్చే కార్యక్రమాన్ని ప్రారంభిస్తామన్నారు. వచ్చే జాతరలో భక్తులకు అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేస్తామన్నారు. మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ దేవాదాయ శాఖ ద్వారా భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు చేశామని చెప్పారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. జాతర వచ్చినప్పుడే కాకుండా మేడారం అభివృద్ధికి మంత్రుల సహాయంతో కృషి చేస్తానని పేర్కొన్నారు. సమావేశంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, కలెక్టర్ ఇలాత్రిపాఠి, ఎస్పీ డాక్టర్ పీ శబరీష్, ప్రభుత్వ విప్ మురళీనాయక్, ఐటీడీఏ పీఓ అంకిత్ పాల్గొన్నారు.



తాత్కాలిక బస్టాండ్ ఆవరణలోనే పడిగాపులు గాస్తున్న ప్రయాణికులు

## ఇంటికి పోలేక.. ఇక్కడ ఉండలేక..

### మేడారంలో భక్తుల జాగారం

కన్నాయిగూడెం, ఫిబ్రవరి 23 : మేడారంలో భక్తులు శుక్రవారం రాత్రంతా జాగారం చేయాల్సి వచ్చింది. ఇంటికి వెళ్లే దారిలేక.. అక్కడే ఉండలేక పిల్లలు, వృద్ధులు సహా వేలాది కుటుంబాలు అవస్థపడ్డాయి. శుక్రవారం సాయంత్రం నుంచే ఒక్కసారిగా దారులన్నింటా ట్రాఫిక్ జామ్ కావడంతో మేడారంలోనే బస్సులను నిలిపివేశారు. ఉదయం 5గంటల దాకా బస్సులు కదలవని ఆర్టీసీ అధికారులు చెప్పడంతో చేసేదేంలేక నానా ఇబ్బందులు పడ్డారు.

